సాక్షి నల్లగొండ

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



12 చోట్ల అద్దె భవనాల్లోనే..
ఉమ్మడి జిల్లాలో 12 చోట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. - 10లో



అధిక వడ్డీ ఆశచూపి..
అధిక వడ్డీ ఆశచూపి అమాయకుల నుంచి విప్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ రూ.లక్షలు వసూలు చేసి మోసం చేసింది. - 10లో



నిస్వార్థానికి నిదర్శనం..
కొండవీటి బుచ్చిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి నిస్వార్థానికి నిదర్శనమని సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



పజ్జూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

తిప్పర్తి: ధాన్యం అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా ఆయా కేంద్రాల నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి కొనుగోళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కాంటాలు వేయాలన్నారు. ప్రతిరోజూ ట్రక్ షీట్‌లు డీఎం కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం శ్రీదేవి, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండలోని మగ్దూమ్ భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టంతో మైనార్టీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉన్న ప్రజాస్వామికవాదులు, మేధావులు, అన్నివర్గాల ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలన్నారు. బొడ్డుపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, అంజయ్యాచారి, బొల్లుగిరి నర్సింహ, టి.వెంకటేశ్వర్లు, నలప రాజు రామలింగయ్య పాల్గొన్నారు.

యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటయ్య

చివ్వెంల(సూర్యాపేట) : యువత.. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం చివ్వెంల మండలం మున్యానాయక్ తండా ఆవాసం పీక్లాతండాలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఆర్థిక అసమానతలు లేని సమసమాజం నిర్మించడమే అంబేడ్కర్ ఆశయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, షెడ్యూల్డ్ కులాల అధికారులు కె.శంకర్, లత, తహసీల్దార్ కృష్ణయ్య, లంబాడీ విద్యార్థి సేనా రాష్ట్ర నాయకుడు ధరావతు బాలు నాయక్, మాజీ సర్పంచ్ బీకారి, మాజీ ఎంపీటీసీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

1,679 ఎకరాల్లో పంట నష్టం

అకాల వర్షాలతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, పండ్లతోటలు

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యం
- ఐదు మండలాల్లో తీవ్రంగా నష్టపోయిన 747 మంది రైతులు
- శాలిగౌరారంలోనే 1,031 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపిన జిల్లా వ్యవసాయ శాఖ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఇటీవల కురిసిన అకాల వర్షానికి జిల్లాలో పెద్ద ఎత్తున పంటలకు నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వరి చేలతో పాటు నిమ్మ, బొప్పాయి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో పాటు వరదలో కొట్టుకుపోయింది. ముఖ్యంగా శాలిగౌరారం, గుర్రంపోడు, పెద్దవూర, పీఏపల్లి, నకిరేకల్, కేతేపల్లి మండలాల్లో వరి, మొక్కజొన్న పంటలకు మునగ, బొప్పాయి, నిమ్మ తోటలకు నష్టం జరిగింది. మొత్తం 746 మంది రైతులకు చెందిన 1,679 ఎకరాల్లో ఆయా పంటలకు నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ లెక్కలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆమోదంతో వ్యవసాయశాఖ ప్రభుత్వానికి పంపించింది.



శాలిగౌరారం మండలం మాదారంకలాన్‌లో నేలకొరిగిన మొక్కజొన్న చేను



గుర్రంపోడ్ మండలం పిట్టలగూడెంలో నేలకొరిగిన బొప్పాయి చెట్లు

అత్యధికంగా శాలిగౌరారంలోనే..

జిల్లాలో ఇంకా 20 శాతం వరకు వరి కోతలు పూర్తి కావాల్సి ఉంది. వడగళ్ల వానతో ధాన్యం అంతా పొలాల్లో రాలిపోయింది. వేగంగా వీచిన గాలులతో వరి, మొక్కజొన్న పెద్ద ఎత్తున నేలవాలిపోయింది. నిమ్మ తోటల్లో చెట్లు విరిగిపడ్డాయి. జిల్లాలో 1,679 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లితే అందులో ఒక్క శాలిగౌరారం మండలంలోని 14 గ్రామాల్లో 603 మంది రైతులకు చెందిన 1,031 ఎకరాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ తరువాత అత్యధికంగా నకిరేకల్‌లో పంటలు దెబ్బతిన్నాయి.

పంట నష్టం వివరాలు..

మండలం	గ్రామం	పంట	ఎకరాలు	రైతులు
శాలిగౌరారం	మాదారంకలాన్	వరి,మొక్కజొన్న,నిమ్మ	450	220
	ఊట్కూర్	వరి	250	180
	చిత్తలూరు	వరి	30	20
	వంగమర్తి	వరి	10	9
	ఇటుకలపాడ్	వరి	10	8
	పెర్కకొండారం	వరి,నిమ్మ	26	24
	ఆకారం	వరి, నిమ్మ	35	26
	శాలిగౌరారం	వరి, నిమ్మ, మునగ	20	11
	ఎర్జీకొత్తపల్లి	వరి	30	15
	బైరోనిబండ	వరి	110	50
	పాతకొండారం	వరి, నిమ్మ	5	5
	రామాంజపురం	వరి	20	10
	గురజాల	వరి	10	5
	తక్కెళ్లపహడ్	వరి	25	20
గుర్రంపోడు	ముల్కలపల్లి	బొప్పడి	2	1
	కొప్పోలు	బొప్పడి, సొర	6	3
	చేపూర్	బొప్పడి	2	2
	చేపూర్	మొక్కజొన్న	2	1
పెద్దవూర	పెద్దవూర	మొక్కజొన్న	2	1
పీఏపల్లి	గనిపల్లి	మొక్కజొన్న	14	5
నకిరేకల్	కడపర్తి	నిమ్మ	200	30
	నోముల	నిమ్మ	180	40
	పాలెం	నిమ్మ	180	45
	వలభాపురం	నిమ్మ	25	5
	నడిగూడెం	నిమ్మ	15	4
	ఓగోడు	నిమ్మ	5	5
కేతేపల్లి	గుడివాడ	నిమ్మ	15	3

చేతికందిన బొప్పాయి నేలపాలైంది



ఈయన పొగాకు నారాయణ. గుర్రంపోడు మండలం చామలేడు గ్రామం. ఈయన పిట్టలగూడెంలో ఆరెకరాలు కౌలుకు తీసుకుని బొప్పాయి సాగుచేశాడు. ఏడాదిన్నర నుంచి రూ.6 లక్షల పెట్టుబడి పెట్టాడు. మొదటి పంట 5 టన్నులు మాత్రమే కోశాడు. మిగిలిన దాదాపు 20 టన్నుల పంట కోదామనుకునేలోపే ఇటీవల వడగండ్ల వానకు తోట నేలపాలైంది. గాలి వానకు దిగుబడి దశలో ఉన్న 300 మొక్కలు నేలకూలగా మరో 300 మొక్కలపై భాగం, కొమ్మలు విరిగిపోయాయి. కాయలు, పూత, పిందె అంతా నేలపాలైంది. 20 టన్నులకుగాను సుమారు నాలుగు లక్షల రూపాయల పంట నష్టం జరిగిందని నారాయణ ఆవేదనచెందుతున్నాడు.



నకిరేకల్ మండలంల పాలెం గ్రామంలో విరిగిన మామిడి చెట్టు



మాదారంకలాన్‌లో కూలిపోయిన నిమ్మచెట్లు

పంటదెబ్బతిని అప్పుల పాలయ్యాను



మా గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద 9 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగుచేశాను. ఇందుకు రూ. 2.50 లక్షలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టా. పంట కూడ కోతదశకు వచ్చింది. వరికోత యంత్రాల కొరతతో సకాలంలో పంటను కోయలేదు. మరో రెండు, మూడు రోజుల్లో వరికోతలు చేపడదామనుకున్నా. ఇంతలోనే వడగండ్ల వర్షానికి వరిచేనుపై ఉన్న ధాన్యం సుమారు 60 శాతానికి పైగా నేలరాలింది. వ్యవసాయం చేసి ఆర్థికంగా బాగుపడుదాం అనుకుంటే ప్రకృతి మాపై కన్నెర్ర చేసింది.

– చింతల శంకర్, శాలిగౌరారం

మామిడి చెట్లు కూలిపోయాయి



వడగండ్ల వర్షంతో పెను నష్టం జరిగింది. మామిడి చెట్లు కూలిపోయాయి. రెండు వేల పైనే మామిడి కాయలు రాలిపోయాయి. రాలిన కాయలన్ని పండుబారడంతో పారబోశాం. ప్రతి ఏటా మామిడి తోటల నుంచి వచ్చే రాబడిపైనే మా కుటుంబం ఆధారపడి ఉంది. ఇప్పుడు చెట్లు కూలిపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

– కరెంద జానకిరాములు, ఓగోడు

మొక్కజొన్న చేను మొత్తం నేలవాలింది



ఎకరంలో వరి, మూడెకరాల్లో పత్తి వేశా. అలాగే మరో రైతుకు చెందిన 10 ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగుచేశాను. మొక్కజొన్న పంట కోసం రూ. 3.50 లక్షలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాను. ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట కోతదశకు వచ్చింది. మరో వారం రోజుల్లో పంటకోతలు మొదలు పెడదామనుకున్నా. ఇంతలోనే భారీ గాలులతో కూడిన వర్షానికి 10 ఎకరాల్లో చేను మొత్తం నేలమట్టమైంది. పంటసాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు.

– రూపని యాదగిరి, వంగమర్తి

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకున్న ఏడెకరాల్లో నిమ్మతోట వేశా. 480 నిమ్మచెట్లు ఉన్నాయి. నిమ్మకాయ తెంచే దశలో వచ్చిన భారీ ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షానికి చేతికందే నిమ్మకాయ నేల రాలింది. ఈదురుగాలులకు తోటలోని 132 నిమ్మచెట్లు నేలకూలాయి. చివరకు అప్పులే మిగిలాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

– జేరిపోతుల చంద్రమౌళి, మాధారంకలాన్

ఘనంగా భూదాన వజ్రోత్సవాలు



వెదిరె రాంచంద్రారెడ్డి, వినోబాభావే చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కోదండరెడ్డి



సీత శ్రీరాములుకు భూదాన జయంతి పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం, కోదండరెడ్డి

- వినోబాభావే మందిరంలో శాంతి యజ్ఞం
- హాజరైన వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, భూదాన యజ్ఞబోర్డు సభ్యులు

భూదాన్‌పోచంపల్లి : భూదానోద్యమానికి అంకురార్పణ జరిగి 75వ వసంతంలోకి అడుగిడిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ సంయుక్త ఆధ్వర్యంలో భూదాన వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినోబాభావే మందిరంలో ఉదయం శాంతి యజ్ఞం నిర్వహించారు. అనంతరం టూరిజం పార్కు ఆవరణలో ఉన్న భూదానోద్యమపిత ఆచార్య వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలకు తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భూభారతి రూపకర్త భూమి సునీల్‌కుమార్, భూదాన యజ్ఞబోర్డు మాజీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సర్వోదయ నాయకులు వెదిరె అరవిందారెడ్డి, తడక వెంకటేశం, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, భూభారతి సభ్యులు రాంరెడ్డి, గోపాల్ రెడ్డి, స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భూభారతి–భూదాన భూముల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భూభారతి చట్టం వల్ల ప్రతి పేదవాడి భూములకు భరోసా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం సీత శ్రీరాములు, తడక ముత్యాలు, కరగల్ల నర్సింహకు భూదాన జయంతి పురస్కారాలను కోదండరెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

వెదిరె రాంచంద్రారెడ్డి, జ్యోతిబాపూలే విగ్రహాల ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన

చౌటుప్పల్ పట్టణ చౌరస్తాలో ప్రతిష్ఠించనున్న భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి, జ్యోతిబాపూలే విగ్రహాల ఏర్పాటు పనులకు వెదిరె రాంచంద్రారెడ్డి మనుమడు వెదిరె అరవిందారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తడక వెంకటేశం, పోచంపల్లి అర్బన్‌బ్యాంకు చైర్మన్ తడక రమేష్, పాక మల్లేశ్, భారత లవకుమార్, సామ మధుసూధన్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, కొట్టం కరుణాకర్‌రెడ్డి, పావనిరెడ్డి, గోవర్ధన్, కవిరచయిత గోపాల్, వినోబాభావే సేవా సంఘం నాయకులు ఏలే భిక్షపతి, కొయ్యడ నర్సింహ, నోముల గణేశ్, మోటె రాజు, గునిగంటి రమేష్, పోతగల్ల దానయ్య, పెద్దల చక్రపాణి, కొమ్ము లక్ష్మణ్, శ్రీను, కుమార్, వేశాల మురళి, మెరుగు శశికళ పాల్గొన్నారు.

● భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే





నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో మరియరాణి మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఏసుక్రీస్తు వేషధారణలో సిలువ మోస్తున్న భక్తుడు, సిలువ ప్రదర్శనను తిలకిస్తున్న క్రైస్తవులు

కళతప్పిన పార్కులు

అన్ని మున్సిపాలిటీల్లోనూ నిర్వహణ లోపం

- విరిగి మూలకుపడిన ఆట వస్తువులు
- ఎండిన గ్రీనరీ.. కనిపించని పచ్చదనం
- చిన్నారులకు కరువైన ఆహ్లాదం
- వాటివైపు వెళ్లని పట్టణ వాసులు

మున్సిపల్ పార్కులు వెలవెలబోతున్నాయి. నిర్వహణ లోపానికితోడు పిల్లలు ఆడుకునేందుకు వివిధ రకాలు వస్తువులు లేకపోవడంతో వాటివైపు ఎవరూ వెళ్లడం లేదు. కొన్నిచోట్ల ఇదివరకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు ధ్వంసమయ్యాయి. పచ్చదనం కోసం నాటిన మొక్కలు ఎండిపోయి ఆహ్లాదం కరువైంది. మరికొన్ని చోట్ల పార్కులకు జనం వస్తున్నా వసతులు కరువయ్యాయి. ఉదయం పూట కొన్ని పార్కుల్లోనే జనం వాకింగ్‌కు వెళ్తున్నారు. మిగతా వాటికి జనం పెద్దగా రావడం లేదు. ఫలితంగా పార్కులు కళతప్పాయి. ఈ విషయాలు 'సాక్షి' విజిట్‌లో వెలుగుచూశాయి.





నల్లగొండ రాంనగర్ పార్కులో విరిగిపోయిన రంగులరాట్నం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లు

కంపచెట్లకు నిలయం

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీలోని నాలుగు పార్కులు పచ్చదనం ఎండిపోయి కళతప్పాయి. హిల్‌కాలనీలో నెహ్రూ పార్కు, ఎస్ఈ కార్యాలయం ముందున్న పార్కు, పైలాన్‌కాలనీలో బ్యాంకు పార్కు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎర్తుడ్యాం దిగువన గల శివం పార్కు నిర్వహణ లోపంతో కంపచెట్లకు నిలయంగా మారాయి.



నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో గల నెహ్రూ పార్కులో ఎండిన మొక్కలు

ఆట వస్తువులే లేవు!

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణ శివారులోని రాంనగర్ పార్కు పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం కనిపించినా పిల్లలు ఆడుకునే పలు ఆట పరికరాలు పాడైపోయాయి. నిర్వహణ లోపంతో రంగులరాట్నం విరిగిపోయింది. బోటింగ్‌ను పక్కకు పడేశారు. మహిళల టాయిలెట్ల వద్ద పిచ్చి మొక్కలు మొలిచాయి. ఇక పట్టణంలోని ఇతర పార్కుల్లోనూ కొన్ని చోట్ల కొన్నే ఆట సామగ్రి ఉండగా చాలా చోట్ల కరువయ్యాయి. విద్యా సంస్థలకు సెలవులు కూడా రానున్నందున పార్కులో సౌకర్యాలు కల్పిస్తే మున్సిపాలిటీకి ఆదాయం సమకూరనుంది.



శ్రీచైతన్యనగర్ బోటింగ్ పార్క్‌లో నిరుపయోగంగా మారిన పిల్లల ఆట సామగ్రి

ఆహ్లాదం పంచని పార్క్‌లు



పార్క్‌లో ధ్వంసమైన ఆట పరికరాలు

దేవరకొండ: దేవరకొండ మున్సిపల్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి నిధులతో మూడు చోట్ల చిల్డ్రన్ ప్లే పార్కులు ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు వివిధ ఆట పరికరాలు సమకూర్చారు. ఆహ్లాదాన్ని పంచేలా చెట్లను పెంచారు. ఏర్పాటు చేసిన కొన్ని రోజుల పాటు బాగానే ఉన్నా.. నిర్వహణ లోపంతో నేడు ఆహ్లాదం కరువైంది. సంజయ్‌కాలనీ, ముత్యాలమ్మ బజార్ పార్క్‌ల్లో ఆటవస్తువులు కొన్ని ధ్వంసం కాగా చెత్తా చెదారంతో నిండి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు పరికరాలను ధ్వంసం చేస్తుండడంతో నిర్వహణ కష్టతరంగా ఉందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

వెలవెలబోతున్న పార్కులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో 1.33 లక్షల జనాభా ఉండగా మొత్తం 14 పార్క్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో ఎన్ఎస్పీ క్యాంపులోని సుందరయ్య పార్క్, చైతన్యనగర్‌లోని బోటింగ్ పార్క్, హౌసింగ్ బోర్డులోని నాలుగు పార్క్‌ల్లో గతంలో చిన్నారులు ఆడుకునేందుకు వివిధ రకాల సామగ్రి ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ లోపంతో ఎక్కడికక్కడి విరిగిపోయాయి. ఒక సుందరయ్య పార్క్ మినహా ఏ పార్క్‌లోనూ పచ్చదనం అనే మాటే కనిపించడం లేదు. గతంలో ఆదివారం వచ్చిందంటే ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారుల పెద్దసంఖ్యలో వచ్చేవారు. నేడు పార్క్‌ల్లో ఆట వస్తువులు లేకపోవడంతో ఎవరూ రాక పిచ్చిమొక్కలతో నిండిపోయి వెలవెలబోతున్నాయి.

యాదగిరి క్షేత్రంలో నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా చేపట్టారు. సాయంత్రం ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. ఆండాళ్ అమ్మవారికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్ఠింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు.

ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు

ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు.గర్భాలయంలో స్వయంభూలకు నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చాన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి భక్తులకు స్వామి, అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, అష్టోత్తర పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు



నల్లగొండ బస్టాండ్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో శుక్రవారం టూటౌన్ ఎస్‌ఐ సైదులు ఆధ్వర్యంలో నిషేధిత మత్తు పదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ స్క్వాడ్లతో తనిఖీలు నిర్వహించారు. రద్దీగా ఉండే ప్రాంతాలైన బస్టాండ్, లాడ్జీలులు, దుకాణాల్లో తనిఖీ కొనసాగాయి. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. లాడ్జీల్లో బస చేసే వారి నుంచి సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని, వారి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానితుల వివరాలను వెంటనే తమకు తెలియజేయాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఎవరైనా నిషేధిత మత్తు పదార్థాలు వాడితే చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ నుంచి గరిడేపల్లి వైపు బైక్‌పై వస్తున్న వ్యక్తిని అప్పన్నపేట గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానికులు 108 వాహనంలో అతడిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదని, బైక్ నంబర్ ఆధారంగా కూడా అడ్రస్ లభ్యం కానట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నలుపు, నీలం రంగు గడీల చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించాడని, వయస్సు సుమారుగా 30ఏళ్లు ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని కోదాడ ఏరియా ఆస్పత్రిలో ఉంచినట్లు తెలిపారు. ఈ మేరకు ఏఎస్‌ఐ రాములు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

12 చోట్ల అద్దె భవనాల్లోనే..!

- ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- మూడింటికి మాత్రమే సొంత భవనాలు
- శాశ్వత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు



యాదగిరిగుట్ట పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

యాదగిరిగుట్ట: ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం వస్తున్నప్పటికీ ప్రభుత్వాలు శాశ్వత భవనాలను నిర్మించకపోవడంతో ఎన్నో ఏళ్లుగా అద్దె భవనాల్లోనే ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. ఇందులో మోత్కూరు, నకిరేకల్, కోదాడలో మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతా 12 కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

42 ఏళ్లుగా అద్దె భవనాల్లోనే..

యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 1983లో ఏర్పాటైంది. గత 42 సంవత్సరాలుగా అద్దె భవనంలోనే ఈ కార్యాలయం కొనసాగుతోంది. చౌటుప్పల్‌లో 1995లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు కాగా.. 30 ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. యాదగిరిగుట్టలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మొదట్లో పట్టణంలోని గాంధీనగర్‌లో అద్దె భవనంలో ప్రారంభించారు. ఆ తర్వాత నల్లపోచమ్మవాడలోని ఓ ఇంట్లోకి మార్చారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి, రోడ్డు విస్తరణలో ఆ ఇల్లు పోవడంతో తిరిగి యాదగిరిపల్లి దుర్గమ్మ గుడి సమీపంలోని ఓ యాజమానితో మాట్లాడి, భవనాన్ని అద్దెకు తీసుకొని అందులోనే ఇప్పుడు నడిపిస్తున్నారు. ఇందుకు గాను ప్రతినెల రూ.6,549 అద్దెను ప్రభుత్వం చెల్లిస్తోంది. చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు ప్రతి నెల రూ.10వేలు అద్దె చెల్లిస్తున్నారు.

కార్యాలయాల్లో సదుపాయాలు కరువు..

గత 20 ఏళ్ల నుంచి యాదగిరిగుట్ట, భువనగిరి, చౌటుప్పల్ వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం పెరగడం, యాదగిరిగుట్ట ఆలయం పునర్నిర్మాణం, హైదరాబాద్–వరంగల్, హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారులపై పరిశ్రమలు, వ్యాపారాలు పెరగడంతో ప్లాట్ల క్రయవిక్రయాలు భారీగా జరుగుతున్నాయి. దీంతో క్రయవిక్రయదారులకు ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనాల్లో, గృహ వినియోగం కోసం నిర్మించిన భవనాల్లో కార్యాలయాలు పెట్టడంతో తగిన సదుపాయాలు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు, అమ్మకాలు జరిపేందుకు వచ్చే వారికి మరుగుదొడ్లు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు ఉండటం లేదని పలువురు వాపోతున్నారు. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ సమయంలో తమ నంబర్ వచ్చేంత వరకు కార్యాలయ పరిసరాల్లో నిల్చొని నిరీక్షించాల్సి వస్తుందని క్రయవిక్రయదారులు అంటున్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి

రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలోని మొదటి అంతస్తులోకి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత భవనం ఉంటే గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కార్యాలయం ఉంటుంది. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం యాదగిరిపల్లిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.6,549 అద్దె ప్రతినెలా చెల్లిస్తున్నాం. ప్రభుత్వం సైతం నూతనంగా శాశ్వత భవనాలు నిర్మాణానికి కృషి చేస్తుందనే నమ్మకం ఉంది.

– వెంకట్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, యాదగిరిగుట్ట

గతంలో శంకుస్థాపన చేసినా..

గత ప్రభుత్వం హయంలో యాదగిరిగుట్టలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించేందుకు యాదగిరిపల్లి దుర్గమ్మ ఆలయం వద్ద శంకుస్థాపన చేశారు. కానీ ఆ స్థలం అంతా యాదగిరిగుట్ట ఆలయ రింగ్ రోడ్డు నిర్మాణంలో కలిసిపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. గతంలో చాలా మంది రియల్టర్లు తమ వెంచర్లలో భవన నిర్మాణానికి ఉచిత స్థలం ఇస్తామని ముందుకు వచ్చినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించింది. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే జిల్లా కలెక్టర్లకు అనువైన స్థలాలను గుర్తించాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

భూ పంపిణీతోనే అసమానతలు దూరం

- సర్వ సేవాసంఘ్ జాతీయ అధ్యక్షుడు చందన్‌పాల్



మాట్లాడుతున్న సర్వ సేవాసంఘ్ జాతీయ అధ్యక్షుడు చందన్‌పాల్

భూదాన్‌పోచంపల్లి: భూమి ఆత్మగౌరవానికి ప్రతీక అని, భూ పంపిణీ ద్వారానే సమాజంలో అసమానతలు దూరమవుతాయని సర్వ సేవాసంఘ్ జాతీయ అధ్యక్షుడు చందన్‌పాల్ అన్నారు. శుక్రవారం భూదాన వజ్రోత్సవాలను పురస్కరించుకొని ఏపీ, తెలంగాణ సర్వోదయ మండలి ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లిలోని వినోబాభావే, వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టూరిజం పార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో చందన్‌పాల్ మాట్లాడుతూ.. కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా ప్రతి పేదవాడికి భూమి పంపిణీ జరిగినప్పుడే గ్రామస్వరాజ్య స్థాపన సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం మాజీ ఎంపీ అజీజ్ పాషా, ఏపీ, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు నీలం రాంబాబునాయుడు, శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. వినోబాభావే పాదయాత్ర ద్వారా 46 లక్షల ఎకరాల భూమిని సేకరించి పేదలకు పంచారని గుర్తుచేశారు. కానీ నేడు కొందరు రాజకీయ నాయకులు, రియల్టర్లు వినోబాభావే ఆశయాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు పంచాల్సిన భూములను కార్పొరేట్ సంస్థలు కబ్జా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూదాన్ భూములను పరిరక్షించాలని కోరారు. అలాగే ఏపీ, తెలంగాణలో భూదాన యజ్ఞబోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్, దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్ కృష్ణప్రసాద్, సర్వోదయ మండలి తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు వై. గిరిప్రసాద్, దీనబంధు, తెలంగాణ, ఏపీ మహిళా సంఘం అధ్యక్షులు యాదమ్మ, దత్తమణి, యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, మహేశ్, సింగర్ ప్రవీణ్, నాయకులు చందు, గోపాల్‌రావు, రమేశ్, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నిస్వార్థానికి నిదర్శనం కొండవీటి బ్రదర్స్

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



బుచ్చిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న గుత్తా, నెల్లికంటి తదితరులు

మునుగోడు: బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అనేక పోరాటాలు చేసిన మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమర యోధులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరులు కొండవీటి బుచ్చిరెడ్డి, కొండవీటి జగన్‌మోహన్‌రెడ్డిలు నిస్వార్థానికి నిదర్శనమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. పలివెల గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన బుచ్చిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి విగ్రహాలను శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉన్నత కుటుంబంలో జన్మించిన కొండవీటి బుచ్చిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్వాతంత్రోద్యమంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకంగా పనిచేసి జైలు జీవితం గడిపారన్నారు. అలాంటి నాయకులు నేటి రాజకీయాల్లో ఎక్కడా కనిపించడం లేదని, కొండవీటి బ్రదర్స్‌ను ఆదర్శంగా తీసుకొని నేటి యువత పేదల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, మేరెడ్డి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కొండవీటి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని బలవన్మరణం



కొండయ్య (ఫైల్)

కేతేపల్లి: తండ్రి మందలించాడని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతపల్లికి చెందిన గీత కార్మికుడు భీమనపల్లి వెంకన్న కుమారుడు కొండయ్య(32) ట్రాక్టర్, హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొండయ్య తరచూ తన తండ్రి టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌ను తీసుకెళ్లి రిపేర్‌కు గురి చేస్తున్నాడు. ఇదే విషయమై ఈ నెల 16వ తేదీ రాత్రి తండ్రి, కొడుకు మధ్య గొడవ జరిగింది. తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన కొండయ్య అదేరోజు రాత్రి ఇంట్లో ఉన్న పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కొండయ్యను సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తల్లి వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తెలిపారు. కొండయ్య మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి



రామకృష్ణ (ఫైల్)

గుండాల: ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి రైతు మృతి చెందిన ఘటన గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండకొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు గంగాపురం రామకృష్ణ (38) తన పొలంలో పండించిన వరి ధాన్యాన్ని గురువారం రాత్రి గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌కు ట్రాక్టర్‌లో తీసుకెళ్లాడు. మధ్య రాత్రి ధాన్యాన్ని ఐకేపీ సెంటర్‌లో పోసి తిరిగి ఇంటికి వస్తుండగా.. ఐకేపీ సెంటర్‌లోనే పక్కనే ఉన్న వరి కుప్ప పైకి ట్రాక్టర్‌ను ఎక్కించాడు. దీంతో రామకృష్ణ ట్రాక్టర్‌పై నుంచి జారి టైరు కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం ఉదయం ఐకేపీ సెంటర్‌కు వెళ్లిన రైతులు గమనించి రామకృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

తేమ, తాలు పేరుతో తరుగు తీస్తున్నారని రాస్తారోకో



కోదాడ–జడ్చర్ల హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

పెద్దవూర: ధాన్యంలో తేమ, తాలు పేరుతో క్వింటాకు తరుగు తీస్తున్నారని శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ ముందు కోదాడ–జడ్చర్ల హైవేపై బీజేపీ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఏరుకొండ నర్సింహ మాట్లాడుతూ.. తాలు, తేమ పేరుతో తరుగు తీస్తూ రైతులను నిండా ముంచడమేనా రైతు ప్రభుత్వం అంటే అని ప్రశ్నించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించినా రైతులు మోసపోతూనే ఉన్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుకు క్వింటాకు రూ.500 బోనస్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు మిల్లర్లు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి ఏరుకొండ పద్మ, రైతులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు అపహరణ

తిరుమలగిరి: మహిళ మెడలోని పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. వివరాలు.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన ములుగురి సుశీల శుక్రవారం తన తల్లిగారి ఊరైన తిరుమలగిరి మండలం అనంతారం గ్రామానికి వచ్చింది. గ్రామ స్టేజీ వద్ద ఆమె ఆటో దిగి నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుంచి ఆమె దగ్గరకు వచ్చి ఆమె మెడలోని మూడు తులాల పుస్తెలతాడు, తులం నల్లపూసల గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

అధిక వడ్డీ ఆశచూపి కుచ్చుటోపీ

- అమాయకులను మోసం చేసిన విప్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ
- ఆన్‌లైన్‌లో లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి మోసపోయిన బాధితులు
- నల్లగొండ డీఎస్పీకి ఫిర్యాదు



నల్లగొండ డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

నల్లగొండ: అధిక వడ్డీ ఆశచూపి అమాయకుల నుంచి విప్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసింది. ఆన్‌లైన్ ద్వారా విప్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే 3 శాతం వడ్డీ చొప్పున నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పడంతో నల్లగొండ జిల్లాతో పాటు వరంగల్ జిల్లాకు చెందిన పలువురు రూ.లక్ష మొదలుకుని కోటి రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. 2018 నుంచి ఈ విప్స్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు జిల్లాలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. విప్ కాయిన్స్ కొనుగోలు చేస్తే ఏరోజు కారోజు ట్రేడింగ్ ప్రకారం వాటికి బిజినెస్ పెరుగుతుందని ఆశ చూపడంతో చాలా మంది విప్ కాయిన్స్ కొని మోసపోయారు. మొదట 3, 4 నెలలు సక్రమంగానే ఆన్‌లైన్‌లో తమకు డబ్బులు అందాయని ఆ తర్వాత అందలేదని బాధితులు పేర్కొన్నారు. దీంతో కంపెనీ యాజమాన్యాన్ని ప్రశ్నించగా.. ఆన్‌లైన్‌లో ఉంటే వడ్డీ కూడా అసలుకు జమవుతుందని, పెట్టుబడి పెరుగుతుందని నమ్మబలికారంటూ బాధితులు వాపోయారు. సంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లో కూడా కంపెనీ కంపెనీ పేరు కనిపించకపోవడంతో తమను చేర్పించిన డైరెక్టర్లను సంప్రదించగా వారు పూణె, దుబాయ్‌లో ఉండే కంపెనీ యజమానుల వద్దకు వెళ్లారని, గత వారమే డబ్బులు ఇస్తామని చెప్పారని బాధితులు పేర్కొన్నారు. డబ్బులు రాకపోవడంతో శుక్రవారం నల్లగొండ డీఎస్పీ కార్యాలయం ఎదుట బాధితులు నిరసన తెలిపారు. అనంతరం డీఎస్పీ శివరాంరెడ్డిని 150 మంది బాధితులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై నల్లగొండ రూరల్ ఎస్‌ఐని సంప్రదించగా.. బాధితుల ఫిర్యాదు మేరకు 15 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూ. 20లక్షలు పెట్టుబడి పెట్టా

నేను 2023లో విప్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టాను. నెలకు లక్షకు రూ.3వేల చొప్పున వడ్డీ ఇస్తామన్నారు. నాలుగు నెలలు మాత్రమే సక్రమంగా ఇచ్చారు. ఆ తర్వాత ఇవ్వలేదు. ఇక్కడ ఉన్న ఏజెంట్లు మమ్మల్ని నమ్మించి స్కీంలో ఇరికించారు. ఏజెంట్లు ఈ నెల డబ్బులు ఇప్పిస్తామని చెప్పారు. ఇవ్వకపోవడంతో నల్లగొండ డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాం. కె.ఎల్.ఎన్.రావు అనే ఏజెంట్ నన్ను ఇందులో చేర్పించాడు. ఇప్పుడు అతడు పట్టించుకోవడం లేదు.

– బోడ రాము, వరంగల్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి గాయాలు



గాయపడిన శ్యాంసుందర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అనంతగిరి: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన అనంతరగిరి మండల పరిధిలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో శుక్రవారం జరిగింది. వివరాలు.. కోదాడ పట్టణానికి చెందిన పాస్టర్ కాసర్ల శ్యాంసుందర్ అనంతగిరి మండలం త్రిపురవరం చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. గతకొన్నేళ్లుగా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. ప్రతి ఆదివారం కోదాడ వచ్చి త్రిపురవరం చర్చికి వెళ్తుండేవాడు. ఆయన భార్య రజిత హైదరాబాద్‌లోనే ఓ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. ముగ్గురు పిల్లలు కూడా హైదరాబాద్‌లోనే చదువుకుంటున్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే కావడంతో కుటుంబంతో కలిసి కోదాడకు వచ్చాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై కుటుంబ సభ్యులతో కలిసి త్రిపురవరం చర్చిలో ప్రార్థనలు చేసేందుకు బయల్దేరాడు. మార్గమధ్యలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో.. కోదాడ వైపు ధాన్యం లోడుతో వేగంగా వస్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్యాంసుందర్, ఆయన కుమార్తె శ్రేష్ఠ, పెద్ద కుమారుడు అభిషేక్ కుడికాళ్లు విరిగాయి. శ్యాంసుందర్ భార్య రజిత తలకు, చిన్న కుమారుడు హరిక్ మహరాజ్ కుడి కాలుకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను కోదాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వారిని హైదరాబాద్‌కు తరలించారు. శ్యాంసుందర్ సోదరుడు కాసర్ల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాంపల్లి మండలం కేతపల్లి గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం వెంకటపేట గ్రామానికి చెందిన సందె హనుమంత్(25) నాంపల్లి మండలం కేతపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు గమనించి పోలీసులకు స మాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి



ఆదిత్య (ఫైల్)

తిరుమలగిరి: ఇంటి ముందు ఆడుకుంటూ నీటి సంపులో పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాలిపురం గ్రామానికి నక్కల ప్రశాంత్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు ఆదిత్య (6) శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటూ పక్కనే ఉన్న నీటి సంపులో పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత తల్లి నాగలక్ష్మి ఇంట్లో నుంచి బయటకు వచ్చి చూడగా ఆదిత్య కనబడకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికింది. సంపులో పడిన ఆదిత్యను గుర్తించి బయటకు తీసి చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి నక్క ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మల్లీశ్వరిది ఆత్మహత్య కాదు.. కుల వివక్ష హత్య

- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మల్లీశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

నిడమనూరు: ప్రేమించిన యువకుడు మోసం చేయడంతో ఆత్మహత్యకు పాల్పడిన నిడమనూరు మండలం బొక్కమంతలపహాడ్ గ్రామానికి చెందిన దళిత యువతి ధర్మారపు మల్లీశ్వరిది కుల వివక్ష హత్య అని బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బొక్కమంతలపహాడ్ గ్రామంలో మల్లీశ్వరి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లీశ్వరి ఆత్మహత్య చేసుకొని ఐదు రోజులవుతున్నా పోలీసులు ఆమె తల్లిదండ్రుల స్టేట్‌మెంట్ నమోదు చేయలేదని ఆరోపించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నప్పటికీ కనీస సాక్ష్యాలను సేకరించడంలో పోలీసులు విఫలమయ్యారని అన్నారు. మల్లీశ్వరి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకోగా.. ఎల్బీనగర్ డీసీపీతో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడి.. ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు సేకరించాలని కోరారు. మల్లీశ్వరి ఆత్మహత్యకు ముందు ఆమెను ఫోన్‌లో పలువురు మానసికంగా వేధించారని ఆరోపించారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి స్పందించి నిందితుడికి సరైన శిక్షపడేలా చూడాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ మల్లీశ్వరి కుటుంబాన్ని పరామర్శించలేదని ఆరోపించారు. ఆయన వెంట నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటి సత్యపాల్, రామాంజయ్యయాదవ్, బొల్లం రవి, దళిత, ప్రజా సంఘాల నాయకులుమహిళా సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

పగుళ్లతో ప్రమాదకరంగా 365వ నంబర్ హైవే



వంగమర్తి వద్ద జాతీయ రహదారికి ఏర్పడిన పగుళ్లు



మాధారంకలాన్ సమీపంలో కోతకు గురైన 365వ నంబర్ జాతీయ రహదారి అంచు

శాలిగౌరారం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 365వ నంబర్ జాతీయ రహదారి పగుళ్లు పట్టి ప్రమాదకరంగా మారింది. రహదారి నిర్వహణలో సంబంధిత అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2018–19లో మహారాష్ట్ర రాష్ట్రంలోని సిరోంచ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని యేర్పేడు వరకు 365వ నంబర్ జాతీయ రహదారిని నిర్మించింది. రహదారి నిర్మాణంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా తానంచర్ల నుంచి నకిరేకల్ వద్ద గల 65వ నంబర్ జాతీయ రహదారి వరకు 70 కిలోమీటర్లు ప్రయోగాత్మకంగా సీసీతో జాతీయ రహదారిని నిర్మించారు. సీసీతో నిర్మించిన ఈ జాతీయ రహదారి శాలిగౌరారం మండలంలోని వంగమర్తి వద్ద సుమారు 200 మీటర్ల పొడవు భారీగా పగుళ్లుపట్టింది. అదేవిధంగా మాధారంకలాన్ సమీపంలోని ఓ పెట్రోల్‌బంక్ సమీపంలో రహదారి అంచు భారీగా కోతకు గురికావడంతో పాటు పెద్ద గొయ్యి ఏర్పడటంతో రహదారిపై వెళ్లే వాహనాలు రహదారి అంచుకు దిగితే ప్రమాదంబారిన పడటం ఖాయం. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పగుళ్లుపట్టిన రహదారిని సరిచేయడంతో పాటు రహదారి అంచుల వెంట కోతకు గురైన చోట మట్టితో నింపి ప్రమాదాలు జరగకుండా నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

కనగల్: దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో పసుపు, కుంకుమ వంటి అభిషేకాలు నిర్వహించారు.

లచ్చిరాంకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న లచ్చిరాం

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉదావత్ లచ్చిరాం డాక్టరేట్ అందుకున్నారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి(పొట్టి శ్రీరాములు) తెలుగు విశ్వవిద్యాలయంలో నందమూరి తారక రామారావు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమి చైర్మన్ రమేష్ ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ 'మహిళా సాధికారిత మరియు సామాజిక సేవ'అంశంలో యూనివర్సిటీ వారు తనకు డాక్టరేట్ అందించారని తెలిపారు.

ల్యాప్‌టాప్ బహూకరణ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ: బీటెక్ చదువుతున్న నల్లగొండ పట్టణానికి చెందిన నిరుపేద విద్యార్థిని కొల్లూరి కావేరికి న్యూజెర్సీకి చెందిన దాట్ల చందన విక్రమ్ వర్మ శుక్రవారం వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా ల్యాప్‌టాప్ బహూకరించారు. కార్యక్రమంలో వేణు, నాగేశ్వరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న స్నేహితులు

మునుగోడు: తమతోపాటు విద్యాభ్యాసం చేసిన స్నేహితుడి కుమార్తె అనారోగ్యానికి గురైందని సాక్షి కథనం ద్వారా తెలుసుకుని ఆ స్నేహితుడికి ఆర్థిక సహాయం అందజేశారు తోటి స్నేహితులు. మునుగోడు మండలంలోని కల్వలపల్లి గ్రామానికి చెందిన ఆరేళ్ల పగిడిమర్రి ప్రసన్న అనే చిన్నారి బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆ చిన్నారికి చికిత్స చేయించేందుకు తల్లిదండ్రులు మహేష్–అనిత పడుతున్న దీన గాథపై గురువారం సాక్షిలో ఆరేళ్ల చిన్నారికి బ్రెయిన్ క్యాన్సర్ అనే కథనం ప్రచురితమైంది. దీంతో మహేష్‌తోపాటు దోమలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.51వేలు పోగుచేసి ఆ నగదును శుక్రవారం ఆ చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో కంభంపాటి సుధాకర్, తండు నాగరాజు, ఆంజనేయులు, నరేష్, చంద్రశేఖర్, నగేష్, వెంకన్న, నర్సింహ, స్వామి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'గుత్తా' పరామర్శ



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుత్తా

కనగల్: మండలంలోని లచ్చుగూడెం గ్రామంలో కనగల్ సింగిల్ విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి తల్లి వంగాల రాములమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం రాములమ్మ కుటుంబ సభ్యులను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పరామర్శించి రాములమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, కె.గోపాల్‌రెడ్డి, మందడి మధుసూదన్‌రెడ్డి, వంగాల యాదవరెడ్డి, మాజీ సర్పంచులు బలుగూరి మల్లయ్య, ఎస్.వెంకటేశ్వరరావు, గోగు యాదయ్య, జి.రామలచ్చయ్య ఉన్నారు.

అభివృద్ధికి నోచుకోని తండాలు

- బీటీ, సీసీ రోడ్లు లేక గిరిజనుల అవస్థలు
- రేషన్ బియ్యం కోసం పక్క గ్రామానికి వెళ్లాల్సిందే
- వినతులు ఇచ్చినా పట్టించుకోని అధికారులు

గట్టుప్పల్ : మండల పరిధిలోని రంగంతండా, అజనాతండాల్లో కనీస సౌకర్యాలు లేక గిరిజనులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నూతన మండలం గట్టుప్పల్ పరిధిలోకి వస్తే తమ బతుకులు మారుతాయని అనుకుంటే.. మండలం ఏర్పాటై రెండు సంవత్సరాలు గడుస్తున్నా తండాల్లో కనీస అభివృద్ధి లేదు. సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉన్నాయి. ఉపాధి లేక రెండు తండాలకు చెందిన గిరిజన యువకులు, మహిళలు పట్నానికి వలసలు పోతున్నారు. రేషన్ బియ్యం.. నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు రంగంతండా నుంచి సుమారు 2.5 కిలో మీటర్లు.. అజనాతండా నుంచి 3.5 కిలోమీటర్ల మేర దూరంలో ఉన్న అంతంపేట గ్రామానికి కాలి నడకన వెళ్లాల్సిందే. రెండు తండాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు మినహా ప్రభుత్వ పాఠశాలలు లేవు. తండాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలు పూర్తి స్థాయిలో లేవు.

మౌలిక వసతులు నిల్..

రంగంతండాలో ఓటర్ల సంఖ్య 226, జనాభా 376 ఉన్నారు. ఇక్కడ సుమారు 40 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. అజనాతండాలో ఓటర్లు 75, జనాభా 115 ఉన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డులు 20 వరకు ఉన్నాయి. అంతంపేట గ్రామం నుంచి రంగంతండా మీదుగా అజనాతండాకు 2023 సంవత్సరంలో రూ.1.75 కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు మొదలుపెట్టారు. కంకర



అంతంపేట నుంచి రంగంతండా వెళ్లే మార్గంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు

పరిచి సంబంధిత కాంట్రాక్టర్ వదిలేయడంతో గిరిజనులు రోడ్డు వెంట నడిచివెళ్లడానికి నరకయాతన పడుతున్నారు. ప్రతిరోజు పనుల నిమిత్తం మండల కేంద్రమైన గట్టుప్పల్, అంతంపేట గ్రామాలకు వెళ్లి తిరిగి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులకు ప్రమాదాలు తప్పడం లేదు. అనేకమార్లు అధికారులకు వినతులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

గ్రామపంచాయతీ ఏర్పాటుకు సిఫారసు..

కనీస అభివృద్ధికి నోచుకోని తమ తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని రంగంతండా వాసులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత అధికారులు సైతం తండాను గ్రామ పంచాయతీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి తమ తండాలను అభివృద్ధి చేయాలని రంగంతండా, అజనాతండా ప్రజలు కోరుతున్నారు.

కంకర పోసి వదిలేశారు



బీటీ రోడ్డు వేస్తామని 2023 సంవత్సరంలో కంకర పోసి వదిలేశారు. కంకర రోడ్డుపై నడుచుకుంటూ మండల కేంద్రానికి వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు నరకయాతన పడుతున్నాం. రాత్రి సమయాల్లో కాలు జారి కింద పడిపోతున్నాం. వెంటనే రోడ్డును పూర్తి చేయించాలి. తండాలో సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలి.

– సక్రు, రంగంతండా

రేషన్ షాపు ఏర్పాటు చేయాలి



మా తండాలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలి. 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న అంతంపేట గ్రామానికి వెళ్లి బియ్యం తీసుకొచ్చేందుకు ఇబ్బంది పడుతున్నాం. కంకర రోడ్డుపై నడవలేకపోతున్నాం. బీటీ రోడ్డు వేసి మా ఇబ్బందులు తీర్చాలి. మా తండాలో ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించాలి. గ్రామంలో ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– లచ్చు, రంగంతండా

సీపీఐతోనే సమస్యలు పరిష్కారం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు: పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పోరాటాల ద్వారా సీపీఐ పరిష్కరిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని కిష్టాపురం, చీకటిమామిడి, రావిగూడెం గ్రామాలకు చెందిన దాదాపు 50 మంది వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం వారి సమక్షంలో సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 ఏళ్లుగా తమ పార్టీ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి నిత్యం ప్రజల కోసం పోరాడి పేదలకు ఇళ్ల స్థలాలు, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చొరవ చూపుతోందన్నారు. అందుకే తమ పార్టీ పట్ల ఆకర్షితులై ఇతర పార్టీలకు రాజీనామాలు చేసి సీపీఐలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరినవారిలో కిష్టాపురంకు చెందిన బింగి శంకరయ్య, కోనేటి ముత్తయ్య, చంద్రయ్య, చీకటిమామిడికి చెందిన



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ సత్యం, పల్లా వెంకట్‌రెడ్డి

ఏరుకొండ నగేష్, రాకేష్, చింతల వెంకటయ్య, తాటికొండ సైదులు, రావిగూడెంకు చెందిన సంపంగి కోటి, చిరంజీవి, నర్సింహ, వెంకటేష్, స్వాములు ఉన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ, జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజాచారి, ప్రధాన కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీను, కౌన్సిల్ సభ్యుడు సురిగి చలపతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

మునుగోడు: మండలంలోని జమస్థాన్‌పల్లి గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం పురోహితుల మంత్రోచ్చరణలు, సన్నాయి చప్పుళ్ల నడుమ నిర్వహించారు. అనంతరం భక్తులు దేవతామూర్తులకు తలంబ్రాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. వార్షికోత్సవానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు.

సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ



తాటికల్‌లో ఓ నిరుపేద ఇంట్లో సన్న బియ్యంతో వండిన భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



బుట్ట అల్లుతున్న ఎమ్మెల్యే వీరేశం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : దేశంలో సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన రుద్రాక్షి యాదగిరి–పుష్ప స్వగృహంలో శుక్రవారం ఆయన సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుష్ప చేసిన భోజనం రుచికరంగా ఉందని, ఈ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని అన్నారు. రోజువారీగా కూలికి వెళ్లి జీవనం సాగించే కుటుంబాలు పండుగ నాడు కూడా సన్న బియ్యం తినలేని పరిస్థితి గతంలో ఉండేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనతో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో పేదలు కూడా ధనికులతో సమానంగా సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, నాయకులు గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న, చెనగాని సుధాకర్, మిర్యాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బుట్టలు అల్లి.. సమస్యలు తెలుసుకుని..

తాటికల్ గ్రామంలో సన్న బియ్యం భోజనం చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే వేముల వీరేశం.. స్థానికులు ఈత కొమ్మలతో అల్లుతున్న బుట్టలను కొద్దిసేపు అల్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నార్కట్‌పల్లి : ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలో గుజ్జుల అశోక్‌స్వామి తన సొంత ఖర్చుతో నిర్మించే రేణుకా ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊషయ్య, స్వామి, కొండయ్య, సత్తయ్య, శ్రీనివాసరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

చిట్యాల: ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టి ఇరవై నాలుగు గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చిట్యాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సీపీఎం, రైతు సంఘాల నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యుడు అర్రూరి శ్రీను, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, లడె రాములు, గుడిసె లక్ష్మీనారాయణ, రూపని ఇద్దయ్య, బొడ్డు బాబురావు, గాదె ఎల్లేష్, గోకుల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్' సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాలుక్‌దార్ మసీదు వద్ద ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మౌలానా హకీమ్ ఖాన్, మజీద్ కమిటీ ప్రెసిడెంట్ రియాజుద్దీన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజీయుద్దీన్, అబ్దుల్ మాలిక్, సల్మాన్, హమీద్, ఖుర్షిద్, సలావుద్దీన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ముస్లింలు

- అధ్వానంగా మున్సిపల్ పార్కులు



చండూరులో తాళం వేసి ఉన్న పార్కు



అసంపూర్తిగా ఉన్న చిట్యాల మున్సిపల్ పార్కు

చండూరు: మున్సిపాలిటీ పరిధిలో మూడు పార్కు స్థలాలు కేటాయించగా ఒక్కటి మాత్రమే అభివృద్ధి చేశారు. ఉన్న ఆ ఒక్క పార్కులో వాకింగ్ ట్రాక్ మాత్రమే ఉంది. పిల్ల లకు ఆడుకునే వస్తువులు ఏమీ ఏర్పాటు చేయలేదు. ఈ పార్క్ కూడా ప్రారంభించిన కొన్ని రోజులు మాత్రమే వినియోగించారు. అయితే ఈ పార్కు శ్మశానవాటికకు పక్కనే ఉండడంతో ఎవరూ సరిగ్గా రాకపోవడంతో నిరుపయోగంగా మారింది.

నాలుగేళ్లుగా అసంపూర్తిగా..

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని వేణుగోపాలస్వామి టౌన్ షిప్‌లో పార్క్ నిర్మాణ పనులు నాలుగేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. రూ.15 లక్షల వ్యయంతో పార్క్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పార్క్ స్థలం చుట్టూ ప్రహరీ, పార్క్ మధ్యలో వాటర్ ఫౌంటెయిన్ నిర్మించారు. ఫౌంటెయిన్ కూడా ప్రారంభించక ముందే పగుళ్లు బారింది. వాకింగ్ ట్రాక్ కోసం నిర్మించిన రెయిలింగ్ గోడ దెబ్బతిన్నది. ప్రస్తుతం పార్క్ స్థలంలో కంపచెట్లు మొలిచాయి. పాలకులు పట్టించుకుని పార్కును పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

రామగిరి(నల్లగొండ): త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అని బిషప్ థమస్‌కుమార్ అన్నారు. నల్లగొండ పట్టణంలో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే జరుపుకున్నారు. దేవరకొండ రోడ్డులోని మరియరాణి దేవాలయం నుంచి మరియగిరి క్షేత్రం వరకు సిలువ ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. మరియగిరి క్షేత్రంపై ఏసు సిలువ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసు క్రీస్తు సిలువ నాటక ప్రదర్శన కలిచివేసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, చర్చి పెద్దలు పసల శౌరయ్య, కొంక శ్యాంసన్, చిన్నయ్య, చార్లెస్, క్యాథరిన్, ఎం.ఆంథోనీ పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కేతేపల్లి, ఇనుపాముల, రాయపురం, భీమారం, చెర్కుపల్లి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేతేపల్లిలో నిర్వహించిన సిలువ ప్రదర్శనకు మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ వేడుకల్లో ఆయా



కేతేపల్లి : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

చర్చిల మత గురువులు మాదాను ఫ్రాంచీస్, జోసెఫ్, చర్చి కమిటీ ప్రతినిధులు, క్రైస్తవులు పసల ఆరోగ్యం, మాదాను విజయరాజు, మాదాను బాలస్వామి, పాలిశెట్టి జోజప్ప, పసల జోజప్ప, బందా జోసెఫ్, జయరాజు, అమర్‌కుమార్, కాటా విజయ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కట్టంగూర్, చిన్నపురి, ముత్యాలమ్మగూడెం, అయిటిపాముల గ్రామాల్లో గల చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫాదర్



రామగిరి(నల్లగొండ): యేసుక్రీస్తు సిలువ ప్రదర్శన

గ్రిగోరి, శాంసన్, కొంక ప్రవీణ్‌కుమార్, అలెగ్జాండర్, మారయ్య పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వంగమర్తిలో గల ప్రసిద్ధ పునీత జోజప్ప, ఇటుకుల పహాడ్‌లోని నిత్యసహాయమాత క్రైస్తవ దేవాలయాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



రామగిరి(నల్లగొండ): యేసుక్రీస్తు నాటక ప్రదర్శన



రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఫిర్యాదు

నల్లగొండ టూటౌన్: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను తగులబెట్టిన కాంగ్రెస్ కార్యకర్తలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు డీఎస్పీ శివరాంరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసులు పెడితే మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడం ఎంతవరకు సమంజస మన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసు ఈడీ విచారణ చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పిల్లి రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతెపాక లింగస్వామి, దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత ముత్యాలరావు, జిల్లా కార్యదర్శి కంచర్ల



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వర్షిత్‌రెడ్డి

విద్యాసాగర్‌రెడ్డి, మిర్యాల వెంకటేశం, రమణ, మంగళపల్లి కిషన్, కొత్తపల్లి ప్రమోద్, దాసరి వెంకన్న, ఏంరెడ్డి భిక్షంరెడ్డి, లకుడాపురం వెంకన్న, పిండి పాపిరెడ్డి, భీపంగి జగ్జీవన్, టంగుటూరి శ్యామ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈదురు గాలులకు చెట్లు, కొమ్మలు విద్యుత్ తీగలపై పడుతున్నందున చెట్లు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. 11 కేవీ పరిధిలోని ప్రకాశం బజార్, రామ్ నగర్, దారుషఫా కాలనీ, మిర్యాలగూడ రోడ్, భారత్ గ్యాస్ ఏరియా, మహిళా ప్రాంగణం, అల్కాపురి కాలనీ, షామ్స్ నగర్, సాయి విశ్వనాథ్ కాలనీ, బృందావన్, హైటెక్ కాలనీలు, రెహమత్ నగర్, అన్సారీ కాలనీ, మాన్యం చెల్క, క్రాంతి నగర్, పద్మావతి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

చలివేంద్రం ప్రారంభం

చిట్యాల : స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎంపీఎల్ లాజిస్టిక్ హబ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం సంస్థ జనరల్ మేనేజర్ జితిన్‌ప్రసాద్ చౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బలిరామ్, అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

శాలిగౌరారం: మనిమద్దె–ఎన్‌జి కొత్తపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మనిమద్దె గ్రామ ట్రాక్టర్స్ యజమానుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణ శుక్రవారం ప్రారంభించారు.ట్రాక్టర్ల యజమానుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నల్లగొండ టౌన్: న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కంబాల శివలీల ఆధ్వర్యంలో నల్లగొండ బస్టాండ్ ఆవరణలో మజ్జిగ పంపిణీ చేశారు. భిక్షాల మహేష్ గౌడ్, సీహెచ్.లక్ష్మీబాయి, బాల మాధవి, మర్రి శ్వేత, నాగమణి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం గ్రామంలో గాంధీ న్యూరో ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పాపిరెడ్డి సేవలు అమూల్యం

నల్లగొండ: తపస్‌కు అలుగుబెల్లి పాపిరెడ్డి అందించిన సేవలు అమూల్యమైనవని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తపస్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్ అధ్యక్షతన నల్లగొండలో జరిగిన పాపిరెడ్డి పదవీ విరమణ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి హనుమంతరావు, సురేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉషారాణి, రమేష్, పెంటయ్య, ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రరావు, భాస్కర్‌గౌడ్, ఎంఈఓ కత్తుల అరుంధతి, నాగమణి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శాలిగౌరారం: మండలంలోని అంబారిపేట గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గూని వెంకటయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండపల్లి కొమరయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు చిరబోయిన లింగస్వామి, గుత్తా రవీందర్‌రెడి పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని గీతాంజలి ఇంగ్లిష్ మీడియం పాఠశాల 26వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించారు.కార్యక్రమంలో ఎంఈఓ అంబటి అంజయ్య, కరస్పాండెంట్ కెవీ.ప్రకాశ్, సుప్రభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మర్రిగూడ : ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన మండలంలోని రాజాపేటతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేటతండా గ్రామంలో కొంపల్లి శోభ ఇంట్లో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ మద్యం నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. 5.2లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కొంపల్లి శోభపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలని ధర్నా

నల్లగొండ టౌన్: నిజామాబాద్ జిల్లాలో కల్లు గీత కార్మికులపై విధించిన సాంఘిక బహిష్కరణను నిరసిస్తూ శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ గంజి మురళీధర్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, మల్లం మహేష్, అనురాధ, సరోజ, ఎండీ.సలీం, రవీందర్, గోపాల్, భిక్షం, యాదయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మలు దహనం

నార్కట్‌పల్లి : ప్రధాని మోదీపై కాంగ్రెస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకులు నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్‌యాదవ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్, ముంత నర్సింహ, మేడబోయిన శ్రీనివాస్, వడ్డెగోని రామలింగం, నోముల నాగరాజు, రవి, ప్రార్థసారథి, పరమేష్, తిరుమలేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

నల్లగొండ : ఏపీలోని కర్నూల్‌లో రఘునాథ ఆచార్య స్వామి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ పంచానన పీఠం ఆర్కే వేదాంతం రచించిన రఘునాథ ఆచార్య స్వామి వైభవ గీతం సీడీని శుక్రవారం ఆవిష్కరించారు. అష్టాక్షరి జీయర్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు పండితులు పాల్గొన్నారు.